# అసత్యాగ్ని • అవ్వారి వేంకటేశ్వరశర్మగారు

'అబ్బాయ్! ఆయనవస్తే బాగా మర్యాదచెయ్యాలిరా! ఏవడలైనా పూరీలైనా పిండివంటగూడా చెయ్యాలిరా! సువ్వారోజున సెలవుతీసుకో. లేకపోతే యింట్లో అవీయివీ సర్దాలిసివుంటుందిగ్గూడాను. అసలెప్పుడొస్తారేం ఆయన' అన్నది కృష్ణవేణమ్మ.

'మామయ్య కనుక్కోని వుత్తరంరాస్తానన్నాడమ్మా! వస్తుంది వుత్తరం. నేనారోజున సెలవెందుకమ్మా? అక్కర్లేదులే. అయినా అప్పటి వీలునుబట్టి ఒకపూట తీసుకుంటే తీసుకుంటాలే. పూరీలవీ రెండు మూడురకాలు చెయ్యి. ఆ విషయంమాత్రం ఆయనకు తెలీకుండావుండేట్టు చెయ్యాలి మనము. 'దాయాదులుంటే అగ్నిహోత్ర మక్కర్లేద'న్నారు పెద్దలు. వూళ్లో దాయాదులు చెపుతారేమో జాగర్తగావుండాలి మనం' అన్నాడు రామారావు.

'ఆ. ఎక్కడికెళ్తాడులే తెలియటానికి. భోంచేసి యిక్కడ్నే పడుకుంటాడు. తరవాత ఫలహారం చేస్తాడు. మామయ్యకుమాత్రం తెలేదాఏం? మామయ్యా ఆయనా మాట్లాడుతూ అక్కడ్నే కూచుంటారు' అని కృష్ణవేణమ్మ అంటూండగానే 'సార్' అని పోస్టువాడు వుత్తరం పడేసిపోయినాడు. రామారావు దాన్నిలా చదివాడు.

చిరంజీవి మా మేనల్లుడు శ్రీకంఠం రామారావుకు అనేక ఆశీర్వచనములు

ఉభయకుశలోపరి.

నే నాయనకు వుత్తరంరాసి కనుక్కుంటే యివ్వాళ ఈపూటనే యిక్కడికి వస్తాననీ, రేపు మీయూరు కలిసి వెళ్దామనీ, వుత్తరంరాశాడు. రేపు పదిగంటలబండికి మేము వస్తాం. జాగర్త.

ఇట్లు,

యస్. శంకరరావు.

౨

అసలు కృష్ణవేణమ్మగారి భర్తవున్నప్పుడు చాలా ఆస్తివుండేది. అది చాలావరకు రామారావు బి. ఏ. చదువుకు ఖర్చుపడింది. ఇప్పుడు చేతిలో నిలవవున్న ఏకొద్దో గొప్పో డబ్బూ యిల్లూ తప్ప స్థిరాస్తి ఏమీ లేదు. రామారావుకు మిడిల్‌స్కూల్లో ఒక ఆక్టింగు వచ్చింది. ఇన్సూరెన్సు కంపెనీ ఏజంటుకూడాను. యిప్పుడు ఆ ఆస్తిబండారం బైటపడకుండా గూఢంగా అట్టేపెట్టి వియ్యాలవారికి తెలీనీకుండా ఏదో ఆస్తి వున్నదనే మిషతో మేనమామ సహాయంవల్ల పెళ్లి జరుపుకోవాలని యీ తల్లీ కొడుకుల నిశ్చయం. మేనమామకు బెజవాడ వాటరువర్క్సులో 40 రూపాయల నౌకరీ. అతనే యింతవరకూ చదువుకునేటప్పుడూ, ముఖ్యంగా నౌకరీ దొరకేటప్పుడూ, సహాయంచేశాడు. ఇప్పుడూ అతనే పెళ్లిచెయ్యాలని ప్రయత్నిస్తున్నాడు. సంబంధానికివచ్చే ఆయనిది రాజమండ్రి. ఆవూళ్లోనే యెలక్ట్రిక్ సప్లై కంపెనీలో 50 రూపాయలొచ్చే నౌకరీ. ఆయనకిద్దరే ఆడపిల్లలు. 10 ఎకరాల మాగానీభూమి కలవాడు. పెద్దపిల్లను కాకినాడలో యిచ్చాడు. యికను ఈపిల్లపెళ్లే కావలసివున్నది. చదువుకున్న ఆస్తిమంతుడికివ్వాలని బహుయిష్టం. యిట్లావుండగా

పరస్పరేణ ఆవార్త మన శంకర్రావు చెవిసోకింది. తిన్నగా వుత్తరంరాశాడు. ‘మా మేనల్లుడు బి. ఏ. ప్యాసైనాడనీ యిప్పుడు పెద్దనౌకరేమీ రాకపోయినా ముందుముందు వస్తుందనీ, దానికోసమే తాను విశ్వప్రయత్నాలు చేస్తున్నాననీ, ఆరెకరాలు మాగాణీవుందనీ, యీతనికిస్తే సర్వవిధాలా బాగుంటుందనీ’. సరే. అదిచూచి ఆయన చూచివస్తానని వుత్తరంరాశాడు. యిదీ అసలు యిప్పటికి జరిగిన సంగతి.

3

సరే ఒకనాడు వాళ్లిద్దరూ వచ్చారు. ఆయన పిల్లవాణ్ణి, బి. ఏ. సర్టిఫికేట్‌ను చూచాడు. అంతా బాగానేవుందని సరేయిస్తానన్నాడు. ఆస్తిమాటమాత్రం మళ్లీఆయన ఎవరినీఅడగలేదు సుమండీ. ‘మీరురండి పండుపసుపు పెట్టి ముహూర్తాలుపెట్టుకోని వద్దురుగాని’ అన్నాడుఆయన. సరేనని ఆయనతోకూడానే మేనమామా అల్లుడూ వెళ్లారు. తథాస్తనురోని శ్రావణశుద్ధదశమినాడు ముహూర్తం నిశ్చయించుకువచ్చారు. ‘యింకా నెలవున్నదిగా! యింతవ్యవధిగా పెట్టుకొచ్చారేం లగ్నం’ అన్నది తల్లి.

౪

ముహూర్తం రేపుఅనగానే బయలుదేరి వెళ్లారు పెళ్లికి. అక్కడ్నే స్నాతకవ్రతంచేసుకొన్నారు. ఐదురోజులపెళ్లి బ్రహ్మాండంగా జరుగుతున్నది. సదస్యంనాడు చెప్పాడు ఒకాయన ఆస్తివిషయంయావత్తూ రహస్యంగా కన్యాదాతతో. అక్కడినుంచి గుసగుసలు బయలుదేరినై. ‘ఆస్తివున్నదన్నారు.’ చదువుకున్నాడు కూడాను. అని ఇస్తానన్నాను. యిట్లాజరుగుతుందని అనుకొనలేదు’ అనికన్యాదాత. యిట్లానానాగోలలతో పెళ్లిసాంతం అయింది. మూడునిద్రలకు తీసికెళ్లారు పిల్లని. మూడునిద్రలుకాగానే బయలుదేరివచ్చారు మంచి రోజైనా చూడకుండా. కొన్నాళ్లకు ఏడాదిలోపల తీసికెళ్తామంటూ మనిషివచ్చాడు. ‘మావాడికి జరీఅంచుల సిల్కుధోవతీ కండువా కావాలని’ తల్లిఅన్నది వచ్చినవారితో. ఆవచ్చినాయన యిక్కడేమీ చెప్పకుండా పిల్లవాణ్ణి తీసికెళ్లాడు. ఈమాటవాళ్లకు తెలిసింది. ‘యింతమాత్రం మోసంచేసినసంబంధం దొరికిందని జరీ అంచుల సిల్కులు తెప్పిస్తాం పాపం;’ అని యింట్లో ఆడవాళ్లుఅనుకున్నారట. ఆసంగతి వరుడికి తెలిసింది. తరువాత వచ్చేరోజున వాళ్లు వీళ్లుకోరినవిగాక ఏవో సామాన్యపుగుడ్డలు పెట్టిపంపేరు. యీ తిరస్కారపు మాటలవల్ల అయితేనేం ఎట్లాఅయితేనేం వీళ్లుపిల్లను ఏడాదిలోపల తీసుకురావటానికి ప్రయత్నించనైనా లేదు. తరువాత కొన్నాళ్లకు వీళ్లే పిల్లరజస్వల ఐనట్లు శాంతినక్షత్రమన్నట్లు తెలియజేశారు శుభలేఖ ద్వారా.

‘ఇంతమాత్రం సంబంధందొరికిందని శాంతి చేసుకుంటాం పాపం;’ అనితల్లి అన్నది. ఈవిషయం శుభలేఖతెచ్చిన మనిషిద్వారా వాళ్లకు తెలిసింది. ఈ మాటలతోటి ఎక్కడివాళ్లక్కడేవుండి పోయినారు. కాని సుశీలకుమాత్రం చాలావుత్సాహం సంతోషమూను తాను అత్తవారింటిదగ్గరుండాలనీ, సాంసారిక కష్టసుఖాల్లో తానుకూడా భాగం పంచుకోవాలనీ. కానీ ఏంజేస్తుంది పాపం! ఆసంగతిఎత్తితే యింటిదగ్గర వాళ్లు వూరుకోరు.

యిట్లా ఎన్నికాపురాలు భగ్నమై పోతున్నాయో అసత్యాగ్నిలో పడి. యిట్లాఅంటే ‘నూరబద్ధాలాడి ఒకయిల్లు నిల్పమన్నారు పెద్దలు’ అంటారు చాలామంది. కాని దానివల్ల వచ్చేనష్టాలను గమనించటం లేదు. అట్లాచెయ్యటంచేత యిళ్లునిలపటమే అవుతున్నదో, కాపురాలు భగ్నంచెయ్యటమే అవుతున్నదో తప్పక గమనించాలి.